# వ్రీడావతి

ఇక ముందుముందు ఎట్లా అఘోరిస్తుందో తెలియదు గానీ, ఇప్పుడుమాత్రం కాంతమ్మకు వల్లమాలిన సిగ్గు. ఆసిగ్గు పడటమనేది దాని ముఖానికి చక్కని తీరును ప్రసాదించ గలిగే మాట నిజమే! కానీ ప్రతిపనిలో గూడా అది ఆ సిగ్గును ప్రదర్శిస్తూంటే ఎట్లా?

అమ్మ పొద్దున్నే లేచింది. అప్పటికి కాంతమ్మ లేవనే లేదు. లేపుదామని అమ్మ గదిలోకి వెళ్ళింది. కాంతమ్మా, బావా పాములకుమల్లే మెలికలేసుకొని పడుకొనివున్నారు. దానిజుట్టు చెదరి వెడల్పుగా నాచువలె, తెల్లటి దుప్పటిమీద పరుచుకొనివుంది. జుట్టుమధ్య దాని మొఖం. ఒంటిమీద గుడ్డ వున్నదో లేదో గూడా తెలుసుకోలేనంత మత్తుగా నిద్రపోతున్నారు. అమ్మచూసింది. చూసినతరువాత అమ్మకు నవ్వొచ్చింది. కాళ్ళవైపున్న దుప్పటితీసి కాంతమ్మమీద కప్పి వెళ్ళిపోయింది. కాంతమ్మ మెల్లిగామూలిగి, బావను సంపూర్ణంగా చేతుల్లోకి పొదువుకొని మరింత దగ్గిరిగా జరిగింది. బావ రాత్రి వొచ్చాడు. కార్యమయిన తర్వాత బావ ఇది రెండోసారి రావటం. బుల్లోడికి పుట్టెంటికలు తియ్యాలనుకుంటున్నాడు నాన్న. అందుకని బావను రమ్మని వుత్తరం రాశాడు.

అమ్మ తనింకా లేవలేదని ఏమన్నా అంటుందేమో! ఏమంటుందేం! పొద్దుపోయి వచ్చాడాయె. అందులో కొత్త మేళమాయె. ముందుగా బావే లేచాడు. లేచి దొంగని దపో

పోతున్న కాంతమ్మను లేపాడు. అది బద్ధకంగా కళ్ళు తెరచి, లేచి కూచుని, రెండుచేతులూ పైకి చాపి, మెల్లిగా వెనక్కు వొంపుతూ వొళ్ళు విరుచుకొంది. కాంతమ్మకు నిజంగా నిద్ర లేచినట్టు లేనేలేదు.

"అప్పుడే తెల్లవారిందా?" అన్నది కాంతమ్మ, దానికి రాత్రంతా రెండునిమిషాలకు మల్లే తోచింది గావును.

"ఇంకా అనుమానంగానే వుందా? కిటికీలోగుండా వొస్తున్న ఈవెలుతురు తెల్లవారిందనే చెబుతున్నది" అన్నాడు బావ పుస్తకాల్లో నాయకుడుమల్లే.

కాంతమ్మ మంచందిగి అసులుసులుగా వున్న చీరెను సరిగా కట్టుకొంది. జుట్టు గోళ్ళతో సరిచేసుకొని ముఖమంతా అరచేతితో రుద్దుకొని, బైటికి పోబొయ్యేటప్పుడు, బావ వెనకాలే వెళ్ళి రెండుభుజాలూ పట్టుకొని ముందుకు తిప్పి కావిలించుకొన్నాడు. కాంతమ్మ ముఖం పక్కకు తిప్పింది.

"ఈ కాలానికి బుద్ధిలేదు. మరొక నాలుగుగంటలు తెల్లవారకుండా వుండకూడదూ!" అన్నాడు బావ.

బావ అన్నమాటతో కాంతమ్మ సంపూర్ణంగా ఏకీభవించింది. అయినా "ఛా వూరుకుందురూ" అంది. గదిముందు ఎవరో తిరుగుతున్న అడుగులచప్పుడు వాళ్ళకు వినిపించకపోతే అట్టా ఎంతసేపుండేవారో!

బావ స్నానంచేశాడు. గదిలో అద్దంముందు నిలబడి తల దువ్వుకొంటున్నాడు.

"కాఫీ యిచ్చిరా అమ్మా!" అన్నది అమ్మ కాంతను. అమ్మ వంటిల్లు అలుకుతున్నది.

"నేను పోను" అన్నది కాంతమ్మ. అది ఏమాటైనా తెగేసి చెబుతుంది.

"ఏమే! కాఫీ యిచ్చిరావటానికేం? ఆ అబ్బాయి స్నానంచేసి చాలాసేపయింది... వెళ్ళిరా అమ్మా!" అన్నది అమ్మ.

"పాపాను పంపించు. అది ఊరికినే వుందిగా!"

"నువ్వేం చేస్తున్నావ్?" అన్నది అమ్మ, అలకటం ఆపి కాంతమ్మను వెనక్కు తిరిగిచూస్తూ. అది వంటింటి కిటికీలోగుండా బావిమీది పిచ్చికలను చూస్తున్నది.

"ఏంపాడో! నాకు 'సిగ్గమ్మా' నే పోను" బావకు కాఫీ యిచ్చి రావటానికి దానికిసిగ్గుట, సిగ్గు!

"అయ్యో సంబండం. ఇట్లా అయితే ఎట్లాగే" అన్నది అమ్మ నవ్వి "పాపాం! బావకు కాఫీ యిచ్చిరా అమ్మా"

పాప వొచ్చి కాఫీ తీసుకెళ్ళి బావ కిచ్చి వొచ్చింది. అమ్మ పిలవబట్టి అది వానగుంటల దగ్గిర్నుండి వొచ్చిందిగానీ, ఇంకొకళ్లు పిలిస్తేనా...చస్తే వొచ్చేదిగాదు.

"కాఫీ యిచ్చావుటే?" అన్నది చెల్లెల్ని కాంతమ్మ.

"ఆఁ" అన్నది పాప అక్కయ్యవేపు చూడకుండానే.

"వక్కపొడి పెట్టావా?"

"ఊఁహుఁ"

"కాఫీతాగి వక్కపొడి వేసుకోరూ? అలమారులో సీసావుంది. కొంచెం పెట్టిరా"

అక్కయ్య మాటంటే పాపాకు బొత్తిగా లక్ష్యం లేదు. చెల్లెలుఉదాసీనత చూసి, కాంతమ్మ చిటుక్కున దాని

మాడుమీద గొట్టి, పక్కపొడి బావకు పెట్టటానికి వెళ్ళింది. అమ్మ యింకా వంటిల్లు అలుకుతూనే వుంది.

'కాఫీ ఎట్లావుంది?' అన్నది కాంతమ్మ.

"పానకంమల్లేవుంది" అన్నాడు బావ.

"నేను చేశానండీ!"

"అయితే దివ్యంగా వుంది. ఈయింట్లో ఇంత అద్భుతంగా కాఫీ కాచే దెవరా? అనుకొన్నాను నవ్వుతప్పి"

బావ కాఫీతాగి, గ్లాసు అడుగునవున్న నాలుగుచుక్కలనూ, కాంతమ్మ పమిటమీద చల్లాడు. అది పమిటను పూర్తిగా కిందికిజార్చి, దొంగకోపాన్ని అభినయించి, బుంగమూతిపెట్టింది. బావకు బుంగపెట్టే వాళ్ళంటే మహాయిష్టం. అందుకనే కాంతమ్మ తరుచుగా బుంగమూతి పెడుతుంటుంది.

"ఇదిగో! అట్లా మూతిపెట్టుకొని నాప్రాణాలు తోడెయ్యకు. నేను వుండలేను" అంటూ బావ ముందుకొచ్చి కాంతమ్మను దగ్గరగాతీసుకొన్నాడు. అది ఇందుకోసమే ఎదురుచూస్తున్నట్టుగా ఏమీ అభ్యంతరపెట్టలేదు.

"ఊఁ, పొండి. మీరు రోజురోజుకు మరీ— అబ్బ వుండండి. ఎవరో వొస్తున్నారు."

గదివాకిట్లో ఎవరో వొచ్చినట్లుగా నీడలు కదిలాడినై. కాంతమ్మ రెండుచేతులతోనూ బావను వెనక్కుతోసి బైటకొచ్చింది.

"ఏమోనమ్మా! కత్తిపీట ఎక్కడుందో కనపడలేదు. వంకాయలు దేంతోకోసేది నాబొందతో!"...అన్నది కాంతమ్మ హడావుడిగా అటూఇటూ తిరుగుతూ—అది ఇంతసేపూ గదిలో

క్త్రిపీటనే వెదుకుతున్నట్టు.అమ్మ నవ్వింది. కాంతమ్మ ఇంత సేపూ ఏకత్రిపీటను గదిలో వెదుకుతున్నదీ అమ్మకు తెలియక పోలేదు.

*　*　*　*　*

ఎండ విరగకాస్తోంది. అందరూ వసారాలో నిద్రపోతు న్నారు. బుల్లోడు, పాప, వెంకమ్మగారి కొట్టంలో పిల్లెమ్మ లాట లాడుకొంటున్నారు. బావ గదిలో పడుకొన్నాడు. కాంతమ్మ గదివాకిట్లో అటొకకాలూ, ఇటుకకాలూ వేసి నిల బడి బావతో మాట్లాడుతున్నది.

"ఇట్లా రా. మాట" అన్నాడు బావ.

"ఇక్కడే వుంటాను చెప్పండి" అన్నది కాంతమ్మ.

"దగ్గిరికి రావాలి"

"నాకేం చెవుడులేదులెండి, వినిపిస్తుంది" అన్నది నవ్వి.

"మంచిమాట" అన్నాడు బావ.

"నాకేం వొద్దులెండి, మీరే దాచుకోండి ఆమాటను" అన్నది కాంతమ్మ. ఆ మంచిమాట ఏమిటో దానికి తెలుసు.

"కాదు. వెంటనే పోదువుగాని."

"వొద్దు; ఎవరన్నా వొస్తారు. ఇక్కడవుంటే వొచ్చే వాళ్ళు కనిపిస్తారు. లోపలికొస్తే తలుపు అడ్డంవొస్తుంది."

"మధ్యాహ్నంపూట . మనింటి కెవరొస్తార్లేవోయ్." అన్నాడు బావ. బావ లేచాడు. నడిమింటి తలుపు దగ్గిరిగా వేశాడు. కాంతమ్మను పట్టుకొని గదిలోకొచ్చాడు.

"అబ్బ! మరీ ప్రాణాలు తీస్తున్నారు. పగలూలేదు. రాత్రీలేదు" అన్నది కాంతమ్మ అక్కణ్నించి లేవకుండానే.

అంత ఇష్టంలేనిదయితే అమ్మమంచందగ్గిర పడుకోకపోయిందా మరి?

బావ మంచంమీద పడుకొన్నాడు. కాంత కాళ్ళురెండూ మంచంమీదనే పెట్టి కూచునివుంది. కాంతమ్మ మెళ్ళో చంద్ర హారాన్ని బావ పరీక్షిస్తున్నాడు. బావగుండీల్ని కాంతమ్మ తిప్పుతున్నది.

గడియారం మూడు కొట్టిందాకా వాళ్ళిద్దరూ అట్లాగే మాట్లాడుతూ కూచున్నారు. దఢాలున తలుపు తీసుకొని పాప లోపలికొచ్చింది. అట్లా జరుగుతుందని వాళ్ళిద్దరూ అనుకోలేదు.

"ఏంకొంప నా బొందకొంప. పెట్టినయ్ పెట్టినచోట వుండిచావవు. నిన్న మధ్యాహ్నం ఇక్కడ సూదిపెట్టాను. ఇవ్వాళచూస్తే లేదు. ఏమే! పాపా?! నువ్వుతీశావా?" అన్నది కాంతమ్మ. సూదికోసం గది నాలుగుమూలలూ వెదుకుతూ. బావ ఎప్పుడో ముసుగుపెట్టుకొని పడుకొన్నవాడల్లా బద్ధకంగా నిద్రలేచినట్లు కళ్ళు నులుముకొని లేచి "ఏమిటి?" అన్నాడు పాపతో.

"సూది కనపళ్ళేదంట బావా! నేను తీశానని అక్కయ్య నన్ను తిడుతోంది బావా!" అని పాప అక్కయ్యమీద ఫిర్యాదుచేసింది. బావ కాంతమ్మనుచూసి నవ్వాడు. కాంతమ్మ పెదిమబిగపట్టి, మొఖంలోకి కోపంరప్పించి, కళ్ళతో పాప వున్నదని సౌంజ్ఞచేసి వెళ్ళింది...

...అమ్మ టీ కాచింది. మధ్యాహ్నంపూట బావ టీ తాగుతాడు.

"ఆ అబ్బాయి లేచాడేమో, టీ యిచ్చి రామ్మా!" అన్నది అమ్మ కాంతమ్మను.

"బావ ఇందాకనే లేచాడమ్మా" అన్నది పాప తల్లితో.

"మరీ కాలుతున్నది. రెండో గ్లాసుగూడా తీసుకెళ్ళవే, కాంతం" అన్నది అమ్మ.

"నేను పోను, పాపాంని పంపించు" అన్నది కాంతం.

"ఏం? ఏమొచ్చిందిః"

"ఏమోనమ్మా! ఆయనదగ్గిరికి పోవటానికి సిగ్గుగా వుంటుంది చచ్చి"

"నాడే! ఇట్లాఅయితే. సిగ్గటమ్మా సిగ్గు! ఏం సిగ్గు? మొగుడుకు టీ యిచ్చి రావటానికిగూడా సిగ్గేనా? వెళ్ళమ్మా. మాఅమ్మవుగదూ. ఇదిగో! ఆయిత్తడి గ్లాసుగూడా తీసుకెళ్ళు."

అమ్మ ఇంకా ఏమిటో అంటున్నది. కాంతమ్మ వినిపించుకోకుండానే దొడ్లో కెళ్ళిపోయింది.

"ఒట్టి పిచ్చితల్లి. ఈ కాలపు బుద్ధులూ పోకళ్ళూ ఎరుగదు. ఎట్లా కాపరంచేస్తుందో ఏమో!" అనుకొన్నది అమ్మ టీ గ్లాసుతీసుకొని బావ గదిలోకి పోతూ.

* * * * *

ఎనిమిదిగంటలకల్లా బావ షికారునుండి తిరిగివొచ్చాడు. రాగానే అమ్మ స్నానానికి లేపింది. బావ తుండుచుట్టుకొని దొడ్లో కాకరపాదు ధగ్గిర నిలబడివున్నాడు. అమ్మ నీళ్ళుతోడి వెళ్ళింది. కాంతమ్మ సబ్బు బావకిచ్చింది. పోతూ, పోతూ కాసిని చన్నీళ్ళు బావమీాద చల్లి నవ్వుకొంటూ వెళ్ళింది.

"వొచ్చావేం? కాస్త వీపు తోమకపొయ్యావుటే!" అన్నది అమ్మ కాంతమ్మను

"వీపు తోమాలా? గుంజ తోమాలా? తోముకో లేదేమిటి?" అన్నది కాంతమ్మ చీకట్లో బావవేపు చూస్తో.

"మరీ యింత చింతకి ట్టెవయిపోతున్నావేం? ఇక ముందు కాపరం ఎట్లా మండబెడతావమ్మా! అందులో అత్తాఆడబిడ్డల అదుపుకూడా లేకుండా, మీఆయన ఏకంగా బస్తీకి పట్టుకెడతా నంటున్నాడు. ఆ యబ్బాయి కూడుగుడ్డలకు కట్టేటట్టున్నావు చూస్తుంటే!"

"అందరూ చేసినట్లే నేనూ చేస్తా. నా వొక్కదాని మొఖాన్నే పొద్దుపొడవలేదుగా" అన్నది కాంతమ్మ కొంచెం కష్టంగా. అమ్మ అన్నమాటకు కాంతమ్మ నొచ్చుకొంది.

అందరూ అన్నాలు తిన్నారు బుజ్జోడు, పాప నిద్ర కూడాపొయ్యారు. కాంతమ్మ పెందరాడే సబ్బుపెట్టి స్నానం చేసింది. తెల్లటి యిస్త్రీచీరె కట్టింది. వాయిల్ జాకెట్టు తొడుక్కుంది. చక్కగా పూలు పెట్టుకొంది. సన్నగా కాటుకగూడా పెట్టుకొంది.

గదిలో పడుకొని ఏమిటో చదువుకొంటున్నాడు బావ. ఆయన పిల్లలతోపాటే భోంచేశాడు. తరవాత కాంతమ్మ తిన్నది. అమ్మ తింటున్నంతసేపూ కాంతమ్మ అమ్మపక్కనే కూచున్నది.

అమ్మ అన్నం తిన్నది. వంటిల్లంతా సర్దింది. దొడ్డితలుపు గడియవేసింది. బుడ్డితీసుకొని నడిమింటి గూట్లో పెట్టింది. కాంతమ్మ అమ్మ వెంటనే తిరుగుతున్నది. అమ్మ బైటికిపోతూ

తలుపులు లాగి, బైటవేపు గొళ్ళెం పెట్టింది. కాంతమ్మ లోపల వేపు గడియవేసి గూట్లో దీపంమలిపి గదిలో కొచ్చింది. బావ చదువుతున్నాడు.

"అబ్బా, ఎప్పుడూ వొకటే చదువు. కళ్ళు నొప్పులు పుట్టవటండీ!" అన్నది బావను వెనక్కు జరిపి మంచంమీద కూచుని

బావ పలక్కుండా చదువుకొంటున్నాడు. "అయ్యో! తమలపాకులు వేసుకోలేదేమండీ! మీకోసమనే అక్కడ పెట్టాను. నానోరు చూడండి సింధూరంమల్లే పండింది" అంటూ కాంతమ్మ తనముఖాన్ని బావముఖం దగ్గిరికి తెచ్చింది. బావ పుస్తకాన్ని పారేశాడు. కాంతమ్మ ముఖలావణ్యం అతని తల తిప్పింది.

"ఏదీ నన్ను చూడనివ్వే" అంటూ రెండుచేతుల తోనూ, దానిముఖాన్ని రెండువేపులా పట్టుకొని ముందుకు లాక్కున్నాడు.

"అబ్బ ... వుండండి. . .మిమ్మల్నే ...వొదలండి" అన్నది. కాంతమ్మ, కేవలం బావను రెచ్చగొట్టే సదభిప్రాయంతో.

"బాగా పండింది" అన్నాడు బావ, కాంతమ్మ చెక్కిలి గట్టిగా ముద్దుపెట్టుకొని. కాంతమ్మ రెండో చెక్కిలి అందించింది" అట్లా చెయ్యటానికి ఈషణ్మాత్రమైనా కాంతమ్మ సిగ్గుపడలేదు.